శనివారం 08-6-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 358, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

## ఈ సారి ఎంపీలంతా చదువుకున్నోళ్లే..!

### కొత్త ఎంపీల్లో 80 శాతానికిపైగా గ్రాడ్యుయేట్స్ ▪ ఆరుగురు ఎంపీలు 10వ తరగతి లోపు విద్య

**ముందడుగు జాతీయం:**

2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన ఎంపీలంతా విద్యావంతులే. ఈ 18వ లోక్‌సభలో ఒక్క చదువురాని ఎంపీ కూడా లేరని అసోషియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ నివేదిక స్పష్టం చేసింది. ఈ ఎన్నికల కోసం మొత్తం 121 మంది నిరక్ష్యరాస్యులు నామినేషన్లు దాఖలు చేయగా.. వారిలో ఒక్కరూ కూడా ఎంపీగా విజయం సాధించలేకపోయారని వెల్లడించింది. ఏడీఆర్ నివేదిక ప్రకారం.. ఈ లోక్‌సభకు ఎన్నికైన 543 మంది ఎంపీల్లో అత్యధిక మంది ఉన్నత విద్యావంతులే ఉన్నారు. కేవలం ఒక్క ఎంపీ మినహా మిగిలిన అందరూ సంబంధిత ధృవపత్రాలను కలిగి ఉన్నారు. ఆ ఒక్క ఎంపీ దగ్గర మాత్రమే విద్యాసంబంధ ధృవపత్రాలు లేవు. మొత్తం 105 మంది ఎంపీలు, అంటే సుమారుగా 19 శాతం ఎంపీలు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అభ్యసించి ఉన్నారు. వారిలో కేవలం ఆరుగురు ఎంపీలు మాత్రమే 10వ తరగతి లోపు విద్యను అభ్యసించారు. మరో 34 మంది 10వ తరగతి పాసయ్యారు. ఇంకో 65 మంది ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులయ్యారు. 98 గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్స్ ఉన్నారు. సుమారు మూడు శాతం మంది డిప్లొమా చేశారు. 147 మంది గ్రాడ్యుయేషన్, మరో 147 మంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. అదేవిధంగా మొత్తం ఎంపీల్లో 5 శాతం మంది డాక్టరేట్ సాధించిన వాళ్లు ఉన్నారు. పార్టీల వారీగా చూస్తే.. బీజేపీకి చెందిన 240 మంది ఎంపీల్లో 64 మంది గ్రాడ్యుయేట్‌లు, 49 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్‌లు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన 99 మంది ఎంపీల్లో 24 మంది గ్రాడ్యుయేషన్, 27 మంది పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు.



IANS

## పదేళ్లయినా కాంగ్రెస్ 100 స్థానాలు దాటదు

- ఎన్డీయేకు కొత్త అర్థం చెప్పిన మోడీ
- మన కూటమి స్ఫూర్తిని చాటుతుంది
- దక్షిణాది ప్రజలు ఎన్డీయేను ఆదరించారు



**ముందడుగు జాతీయం:**

అసలైన భారత్ స్ఫూర్తిని మన కూటమి చాటుతుందని, మనది అత్యంత విజయవంతమైన భాగస్వామ్యం' అని అన్నారు నరేంద్ర మోడీ అన్నారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ఢిల్లీలో శుక్రవారం జరిగింది. ఇందులో తమ లోక్‌సభా పక్ష నేతగా మోడీని ఎన్డీయే నేతలు మిగతా 2లో

## ఒకే కేంద్రంలో ఆరు స్టేట్ ర్యాంకులా..?

- నీట్ ఫలితాలపై దర్యాప్తు చేపట్టండి
- ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ డిమాండ్

**ముందడుగు జాతీయం:**

నీట్ 2024 ఫలితాల్లో ఒకే కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆరోపించారు. వీటన్నింటినీ నివృత్తి చేయాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. దీనిపై వస్తున్న ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకొని వెంటనే దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. తొలుత నీట్ ప్రశ్నాపత్రం లీకైందన్న ఆమె... ఇప్పుడు ఫలితాల్లోనూ కుంభకోణం జరిగినట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారని పే



ర్కొన్నారు. ఈమేరకు తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.మరోవైపు నీట్ ఫలితాల వెల్లడి తర్వాత పలువురు విద్యార్థులు మిగతా 2లో

## కంగనాను కొట్టిన కానిస్టేబుల్‌కు రివార్డ్

వివరాలు 2లో



## మూడు రోజుల్లో కల్కి ట్రైలర్..

వివరాలు 5లో



## రైల్వేలో మిడిల్ బెర్త్ వారికి కొత్త నిబంధనలు

వివరాలు 3లో



## ల్యాప్ టాప్ ఒడిలో పెట్టుకుంటున్నారా...!

వివరాలు 4లో

ముందడుగు
శనివారం, 08-6-2024, హైదరాబాద్

# పదేళ్లయినా కాంగ్రెస్ 100 స్థానాలు దాటదు



మొదటిపేజీ తరువాయి

ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిత్రపక్షాలకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే ప్రదర్శనపై హర్షం వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లలో ఈ కూటమి దేశాన్ని మూడుసార్లు ఐదేళ్లు పాలించింది. మరోసారి ఐదేళ్ల పాలనకు ప్రజలకు అవకాశమిచ్చారు. దేశం కోసం నిబద్ధత కలిగిన బృందం ఇది. ఎన్డీయే అంటేనే సుపరిపాలన. పేదల సంక్షేమమే మనందరి ప్రథమ కర్తవ్యం. దేశ అభివృద్ధి చరిత్రలో కొత్త అధ్యాయం లిఖించాం. వికసిత్ భారత్ స్వప్నాన్ని సాకారం చేసి తీరుతాం. మన కూటమి అసలైన భారత్ స్ఫూర్తిని చాటుతుంది. ఎన్నికల ముందు పొత్తు పెట్టుకున్న కూటమి ఇంతగా ఎప్పుడూ విజయవంతం కాలేదు. ప్రభుత్వం ఏర్పాటు కావాలంటే సంఖ్యాబలం అవసరం. దేశాన్ని నడపాలంటే సర్వసమ్మతం కావాలి. కూటమిలో పరస్పర విశ్వాసమే ప్రధానం. అన్ని అంశాల్లో ఏకగ్రీవ నిర్ణయాలే లక్ష్యం'' అని మోదీ అన్నారు. ఇక ఎన్డీయే అంటే 'న్యూ ఇండియా, డెవలప్డ్ ఇండియా, ఆస్పిరేషనల్ ఇండియా' అని కొత్త అర్థం చెప్పారు.

దక్షిణాది ప్రజలు ఎన్డీయేను ఆదరించారు. కర్ణాటక, తెలంగాణలో ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. అతి తక్కువ కాలంలోనే అక్కడి ప్రభుత్వాలు ప్రజల విశ్వాసం కోల్పోయాయి. లోక్‌సభ ఎన్నికల్లో ఆ రాష్ట్రాల్లోని ప్రజలు భాజపాకు అండగా నిలిచారు. తమిళనాడులో సీట్లు గెలవలేకపోయినా ఓట్లు పెరిగాయి. కేరళలోనూ మా కార్యకర్తలు ఎన్నో బలిదానాలు చేశారు. తొలిసారి అక్కడి నుంచి మా ప్రతినిధి సభలో అడుగుపెడుతున్నారు. అరుణాచల్, సిక్కింలో క్లీన్‌స్వీప్ చేశాం. ఏపీ ప్రజలు కూటమికి పెద్దఎత్తున మద్దతిచ్చారు. చంద్రబాబుతో కలిసి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకున్నాం. ఏపీలో ఇంత భారీ విజయం ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టింది'' అని మోదీ కొనియాడారు. ''కాంగ్రెస్ చాలా వేగంగా పతనమవుతోంది. పదేళ్ల తర్వాత కూడా ఆ పార్టీ గుణపాఠాలు నేర్చుకోలేదు. ఇప్పటికీ తన శక్తి సామర్థ్యాలను తెలుసుకునే ప్రయత్నం చేయట్లేదు. కాంగ్రెస్ హయాంలో వారి సొంత ప్రధానినే అవమానించారు. ఆయన నిర్ణయాలను లెక్క చేయలేదు. గత మూడు ఎన్నికల్లో వారికొచ్చిన స్థానాలు.. ఈ ఒక్క ఎన్నికల్లో మేం సాధించిన సీట్ల కంటే తక్కువే. మరో పదేళ్లయినా ఆ పార్టీ 100 స్థానాల మార్క్‌ను దాటలేదు'' అని మోదీ వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు.

# ఒకే కేంద్రంలో ఆరు స్టేట్ ర్యాంకులా..?

మొదటిపేజీ తరువాయి

ఆత్మహత్యలకు పాల్పడుతుండటంపై ప్రియాంక దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణలపై అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ''లక్షలాది మంది విద్యార్థుల గోడును ఈ ప్రభుత్వం ఎందుకు విస్మరిస్తోంది. నీట్ పరీక్ష ఫలితాల్లో అవకతవకలు జరిగాయని పదేపదే మొత్తుకుంటున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. దర్యాప్తు చేపట్టి వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా?'' అని ప్రియాంక గాంధీ ప్రశ్నించారు. నీట్ పరీక్ష ఫలితాలపై పలువురు అభ్యర్థులు, తల్లిదండ్రులు పలు అనుమానాలు వ్యక్తంచేస్తున్న సంగతి తెలిసిందే.

# కంగనాను కొట్టిన కానిస్టేబుల్‌కు రివార్డ్

## మహిళా కానిస్టేబుల్‌కు సోదరుడు మద్దతు

ముందడుగు జాతీయం:

ప్రముఖ నటి, ఎంపీ కంగనా రనౌత్‌ను చెంపపై కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ చర్యను ఆమె సోదరుడు సమర్థించాడు. రైతు నాయకుడు, పంజాబ్‌లోని కపుర్తలా కిసాన్ మజ్దూర్ సంఘర్ష్ కమిటీ కార్యదర్శి అయిన షేర్ సింగ్ మహివాల్ తన సోదరికి మద్దతుగా నిలిచాడు. ఈ సంఘటన గురించి మీడియాతో ఆయన మాట్లాడాడు. 'చండీగఢ్ ఎయిర్‌పోర్ట్‌లో ఏదో జరిగిందని మీడియా ద్వారా తెలిసింది. కంగనా మొబైల్, పర్సు తనిఖీ చేసిన సమయంలో ఈ సంఘటన జరిగిందని నాకు అర్థమైంది. మహిళలు వంద తీసుకుని రైతుల నిరసనలో పాల్గొన్నట్లు కంగనా అన్నదానిపై నా సోదరి



మానసికంగా చాలా కోపంతో ఉన్నది. అదే ఈ సంఘటనకు దారి తీసింది. సైనికులు, రైతులు ఇద్దరూ ముఖ్యమైనవారు. అన్ని విధాలుగా వారి విధులను నిర్వర్తిస్తున్నారు. ఈ విషయంలో మేం ఆమెకు పూర్తి మద్దతుగా ఉంటాం' అని అన్నాడు. మరోవైపు హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నియోజకవర్గం నుంచి బీజేపీ ఎంపీగా గెలిచిన కంగనా చెంపపై కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్ చర్యను పంజాబ్‌కు చెందిన ఒక వ్యాపారి కూడా సమర్థించాడు. మొహాలీలోని జిరాక్‌పూర్‌కు చెందిన బిజినెస్ మ్యాన్ శివరాజ్ సింగ్ బెయిన్స్ ఆమెకు లక్ష రివార్డు ప్రకటించాడు. పంజాబీ ప్రజలు, పంజాబీ సంస్కృతిని రక్షించిన కుల్విందర్ కౌర్‌కు ఆయన సెల్యూట్ చేశాడు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.



# సీనియర్ల ఆశీర్వాదం తీసుకున్న మోడీ

## అద్వానీ, మురళీ మనోహర్ జోషి ఇంటికి

ముందడుగు జాతీయం:

నరేంద్ర మోడీ ఎన్డీయే లోక్‌సభా పక్ష నేతగా ఎన్నికైన సందర్భంగా బిజెపి కురువృద్ధుడు ఎల్.కె.అడ్వాణీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశం ముగిసిన తర్వాత నేరుగా ఆయన ఇంటికివెళ్లిన మోడీ... వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతున్న విషయాన్ని ఆయనకు స్వయంగా చెప్పారు. ఇద్దరు నేతలూ వివిధ అంశాలపై కొద్దిసేపు చర్చించుకున్నారు. అక్కడి నుంచి పార్టీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి ఇంటికి వెళ్లిన మోడీ.. ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

తమ వద్ద ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సంఖ్యా బలం ఉందని చెబుతూ.. అవకాశం ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు విజ్ఞప్తి చేసారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో నరేంద్ర మోదీని లోక్‌సభా పక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంగతి తెలిసిందే. తాజా సార్వత్రిక ఎన్నికల్లో భాజపా 240 స్థానాల్లో విజయం సాధించింది. అయితే, మిత్రపక్షాలతో కలిసి 293 స్థానాలను సొంతం చేసుకొని ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది.

# తెలంగాణ బీసీలారా అప్రమత్తంగా ఉండాలి..

## కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను గుర్తు చేసిన ఆర్ఎస్పీ



హైదరాబాద్ :

కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను గుర్తు చేస్తూ బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ట్వీట్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను సిద్ధరామయ్య సాక్షిగా కాంగ్రెస్ నాయకులు ప్రకటించారు. అయితే ఆరు గ్యారెంటీల మాదిరిగానే బీసీలను కూడా మోసం చేసే అవకాశం ఉన్నందును తెలంగాణ బీసీలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్ఎస్పీ హెచ్చరించారు.

అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే బీసీ కులగణన చేస్తామని చెప్పి, కేవలం అసెంబ్లీ తీర్మానంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం సరిపెట్టింది. బీసీ కమిషన్ ఇప్పటి వరకు ఈ విషయంలో ఏం చేసిందో ఎవరికీ తెలియదు. బీసీ సబ్ ప్లాన్ జాడ కూడా లేదు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి చట్టపరమైన అడ్డంకులు పెద్దగా ఏమీ లేవని నా భావన. ఇప్పటికే సమగ్ర కుటుంబ సర్వేలో తెలంగాణలో బీసీల శాతం 54 శాతం అని తేలింది. దాని ఆధారంగా స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ ఒక ఆర్డినెన్సు ముందు జారీ చేయండి. చట్టం తరువాత తీసుకురావొచ్చు. మళ్లీ సమయం లేదంటూ బుకాయిస్తూ పాత రిజర్వేషన్లతోనే (23 శాతం) ఎన్నికలు జరిపి బీసీలను మోసం చేయాలని చూస్తే కాంగ్రెసు నాయకుల బతుకులు పల్లేర్లయితయి.. ఖబర్దార్ అంటూ ప్రవీణ్ కుమార్ హెచ్చరించారు.

# తెలంగాణ సరిహద్దుల్లో బర్డ్ ఫ్లూ విజృంభణ

## అప్రమత్తం కాని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ


**ముందడుగు తెలంగాణ:**

బర్డ్ ఫ్లూ వ్యాధి తెలంగాణ సరిహద్దు రాష్ట్రాలలో విజృంభిస్తోంది. వైరస్ వచ్చినప్పుడు చూసుకుందాంలే అనే ధోరణిలో ఉన్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టలేదు. కనీసం ప్రజలను అప్రమత్తం చేయలేదు. పక్షులకు సోకే ఈ వైరస్ ఇప్పుడు మనుషులకు కూడా అంటుకోవడం ఆందోళన కరంగా మారింది. ఇప్పటికే ఈ వైరస్ ఆంధ్రప్రదేశ్ , మహారాష్ట్రతో పాటు కేరళ, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో వ్యాప్తి చెందుతున్నది. ప్రధానంగా ఏపీలోని నెల్లూరు, మహారాష్ట్రలోని నాగపూర్, జార్ఖండ్‌లోని రాంచీ, కేరళలోని అలప్పూజ, కొట్టాయం, పఠాన్ మిట్ట జిల్లాల్లోని ప్రౌల్టీల్లో బర్డ్ ఫ్లూ కేసులు నమోదైనట్టు ఆయా రాష్ట్రాల అధికారులు వెల్లడించారు. కేసులు నమోదైన రాష్ట్రాలు వెంటనే తమకు తెలపాలని కేంద్ర ఆరోగ్యశాఖ కూడా అన్ని రాష్ట్రాలకు లేఖ రాసింది. ఇప్పటి వరకు కేసులు లేని రాష్ట్రాలు అలర్ట్‌గా ఉండాలని సూచించింది. కానీ మన స్టేట్‌లో బర్డ్ ఫ్లూ పై ఇప్పటి వరకు లాంటి అప్రమత్తత లేదు. కనీసం వైద్యారోగ్యశాఖ నుంచి రివ్యూ కూడా పెట్టలేదు. పక్క రాష్ట్రాల్లో కేసులు నమోదవుతున్నా, పబ్లిక్ హెల్త్ విభాగం తమకేమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నది. జనాలకు జాగ్రత్తలు వివరించాల్సిన వైద్యారోగ్యశాఖ, అందుకు తగిన కార్యచరణ, మందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ఫెయిలైందనే విమర్శలు వస్తున్నాయి.



వైరస్‌లు, బ్యాక్టీరియాలు వ్యాప్తి చెందే సమయంలో సహజంగానే పబ్లిక్ హెల్త్ విభాగం ఇన్వాల్వ్ కావాల్సి ఉంటుంది. వ్యాప్తి, తీవ్రతను బట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఇతర రాష్ట్రాల్లో వ్యాప్తి చెందే క్రమంలో అక్కడ్నుంచి మన స్టేట్‌కు స్ప్రెడ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సరిహద్దు ప్రాంతాల్లో స్క్రీనింగ్, వైరస్ నిర్మూలనకు కెమికల్ స్ప్రే, జనాలకు అవగాహన కల్పించడం, లక్షణాలు కలిగిన వ్యక్తులను ఐసోలేట్ చేయడం, బర్డ్ ఫ్లూ వ్యాప్తి చెందే ప్రాంతాల నుంచి మన స్టేట్‌కు రాకపోకలు సాగిస్తున్న వ్యక్తులపై ఫోకస్ పెట్టడం వంటివి చేయాల్సిన బాధ్యత వైద్యారోగ్యశాఖపై ఉంటుంది. కానీ ఇప్పటి వరకు తెలంగాణ అలాంటి యాక్షన్ ప్లాన్‌లు లేకపోవడం గమనార్హం.

# డిజ్నీ + హాట్‌స్టార్ ఇండియాలో మొదటి స్ట్రీమింగ్ సేవ




**ముందడుగు హైదరాబాద్:**

డిజ్నీ + హాట్స్టార్ ప్రపంచంలో క్రికెట్‌కి మరియు డాల్బీ విజన్ యొక్క లైవ్ స్పోర్ట్స్ వేదిక మీద స్ట్రీమ్ చేసే మొదటి ప్లాట్ఫామ్ అయ్యింది. ఈ ఐ సి సి మగవారి టి 20 వరల్డ్ కప్ 2024 అన్ని ఇండియా మ్యాచ్ లు, సూపర్ 8 ఎస్ లు, సెమీ ఫైనల్స్ మరియు ఫైనల్స్ డాల్బీ విజయం లో డిజ్నీ+ హాట్ స్టార్ లో స్ట్రీమ్ చేయబడతాయి.

"క్రికెట్ ఏ ప్రాణంగా మరియు ఊపిరిగా ఇండియా బ్రతుకుతుంది; మరియు వారి వీక్షణ అనుభవాలను స్థిరంగా మరింత లీనమయ్యేలా చేయడమే మా ప్రయత్నం. మా ప్రీమియం ఉన్న వినియోగదారులకు ఐ సి సి పురుషుల టి 20 ప్రపంచ కప్ 2024 ని వారి స్క్రీన్‌లపై మునుపెన్నడూ లేని విధంగా అనుభవించడానికి డాల్బీ విజన్‌ని పరిచయం చేయడం మాకు సంతోషకరం. డాల్బీ తో మా సహకారం ఇండియా లో స్పోర్ట్స్ స్ట్రీమ్ చెయ్యడానికి ఒక ముఖ్యమైన అడుగు వేస్తుంది; మరియు అది వినోదం మరియు సాంకేతికతలో అత్యుత్తమమైన వాటిని అందించడంలో మా ప్రయత్నాలకు కొత్త ప్రాధాన్యతనిస్తుంది."అని ఈ మైలురాయి యొక్క ఉత్తేజాన్ని పంచుకుంటూ డిజ్నీ+ హాట్స్టార్ యొక్క ఇంజినీరింగ్ హెడ్ ముకుంద్ ఆచార్య అన్నారు.

# రైల్వేలో మిడిల్ బెర్త్ వారికి కొత్త నిబంధనలు

- రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 వరకే పడుకోవాలి
- నిబంధనలు పాటించకపోతే చర్యలు

**ముందడుగు ప్రత్యేకం:**

భారతీయ రైల్వే ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రైల్వేశాఖ ఎప్పటికప్పుడు నిబంధనలను మారుస్తుంది. తాజాగా, రైల్వే యంత్రాంగం రైలులో ప్రయాణికులు నిద్రించే సమయాన్ని మార్చింది. కొత్త రూల్ ప్రకారం, రైలులో ప్రయాణీకుల నిద్ర సమయం గతంతో పోలిస్తే తగ్గింది. ఇంతకుముందు ప్రయాణీకులు వారి ప్రయాణ సమయంలో 9 గంటల వరకు నిద్రపోయేవారు. కానీ ఇప్పుడు ఈ సమయాన్ని 8 గంటలకు తగ్గించారు. కొత్త రూల్ ప్రకారం, మీరు ఇప్పుడు రాత్రి 10 నుండి ఉదయం 6 గంటల వరకు నిద్రించవచ్చు.గతంలో ఈ సమయం రాత్రి 9 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఉండేది. స్లీపింగ్ సౌకర్యం ఉన్న రైళ్లలో ఈ నిబంధనను అమలు చేసారు.దీంతో లోయర్



బెర్త్ లేదా కింది సీట్లో కూర్చున్న ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ విషయమై ప్రయాణికుల మధ్య తరచూ వాగ్వాదం జరుగుతోంది. దింతో ఇప్పుడు నిద్ర సమయం కొత్తగా సెట్ చేయబడింది, ప్రయాణికులు ఎలాగైనా ఉదయం 6 గంటలకే నిద్ర లేవాలి. ఈ నిబంధన ప్రకారం ప్రయాణికులు మిడిల్ బెర్త్‌ను రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే తెరిచి ఉంచవచ్చు. నిజానికి మిడిల్ బెర్త్ ఎక్కువసేపు తెరిచి ఉంటే, కింద బెర్త్‌లోని ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతారు. ఉదయం 6 గంటలకు మధ్యలో ఉన్న సీటును క్లోజ్ చేయడం అవసరం. అలాగే, మీరు లోయర్ బెర్త్ సీటుకు మారాలి. అలా చేయడంలో విఫలమైతే మీపై చర్య తీసుకోవచ్చు. కొత్త రూల్ ప్రకారం, లోయర్ బెర్త్‌లో టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్న ప్రయాణికులు రాత్రి 10 గంటలలోపు లేదా ఉదయం 6 గంటల తర్వాత వారి సీట్లలో పడుకోకూడదు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ప్రయాణికులు రైల్వే శాఖకు ఫిర్యాదు చేయవచ్చు.

# జగన్ అహంకారంతో ఓడిపోలేదు..

## ఆర్.కృష్ణయ్య కీలక వ్యాఖ్యలు



ఏపీ ఎన్నికల్లో వైసీపీ దారుణమైన ఓటమిపై రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య స్పందించారు. అహంకారం వల్ల జగన్ ఓడిపోలేదని స్పష్టం చేశారు. ఓటమిపై లోతైన విశ్లేషణ జరుగుతుందని చెప్పారు. హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద శుక్రవారం ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ సంక్షేమ పథకాలను అందించారని జగన్ అన్నారు. ఎక్కడ ఏం జరిగిందో తమకు ఇప్పటికీ అర్థం కావడం లేదని తెలిపారు. ప్రజలందరూ వైసీపీకే ఓటు వేస్తున్నామని చెప్పారని పేర్కొన్నారు. జగన్‌ను అసలు ప్రజలు వద్దనుకోలేదని.. ఎక్కడో తప్పు జరిగిందని అన్నారు. ఈవీఎంల్లో ఏమైనా లోపం ఉందా అనే అనుమానం తమకు ఉందన్నారు. అహంకారం కారణంగానే జగన్ ఓడిపోయారనే ప్రచారం అవాస్తవమని పేర్కొన్నారు. ఏపీ అభివృద్ధిపై కొత్త ప్రభుత్వం ఏం చేస్తుందనే అంశంపై తాను ఇప్పడే స్పందించనని తెలిపారు.

# ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్ విడుదల



**ముందడుగు హైదరాబాద్ :**

ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం సాయంత్రం విడుదల చేసింది. ఈ నెల 8 నుంచి ఉపాధ్యాయుల బదిలీ, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కానుంది. పదవీ విరమణకు 3 ఏండ్ల లోపు ఉన్న వారికి తప్పనిసరి బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వనున్నారు. మల్టీ జోన్ 1లో శనివారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు, మల్టీ జోన్ 2లో రేపట్నుంచి ఈ నెల 30 వరకు బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. కోర్టు కేసులతో గతంలో ఎక్కడ ప్రక్రియ ఆగిపోయిందో అక్కడి నుంచి బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. టెట్‌తో సంబంధం లేకుండానే ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ జరగనుంది.

ముందడుగు
శనివారం, 08-6-2024, హైదరాబాద్



# ప్లీజ్ పెళ్లి చేసుకొండి.. అమ్మాయిని చూస్తాం

- యువత వెంట పడుతున్న ప్రభుత్వం
- డేటింగ్ యాప్‌ను ప్రవేశపెట్టిన జపాన్

**ముందడుగు ప్రత్యేకం:**
జపాన్ ప్రభుత్వం అక్కడి పెళ్లి కాని యువతీ, యువకుల కోసం ఏకంగా డేటింగ్ యాప్స్‌నే తీసుకువచ్చింది. అమ్మాయిని చూసిపెడతాం.. పెళ్లి చేసుకోండిరా బాబూ అంటూ యువత వెంట పడుతున్నాయి.

అయితే జపాన్‌లో జనాభా తగ్గిపోతుండటంతో అక్కడి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. జపాన్‌లో వృద్ధుల సంఖ్య పెరిగిపోతుండటం.. యువత సంఖ్య తగ్గిపోతుండటంతో భవిష్యత్‌లో తీవ్ర సంక్షోభ పరిస్థితులు ఏర్పడనున్నాయని గుర్తించిన జపాన్ ప్రభుత్వం.. చర్యలు చేపట్టింది. అక్కడి యువత పెళ్లిళ్లు చేసుకోకపోవడం, చేసుకున్నా పిల్లల్ని కనకపోవడంతో ఏకంగా ప్రభుత్వమే రంగంలోకి దిగింది. దీంతో జపాన్ ప్రభుత్వం సొంతంగా డేటింగ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. "సింగిల్స్ మీ కోసమే.. మేం పిల్లను వెతికి పెడతాం.. మీరు పెళ్లి చేసుకోండి.. మీకు కావాల్సిన అమ్మాయి, అబ్బాయిలను ప్రభుత్వ ఆధ్వర్యంలోని డేటింగ్ యాప్‌లో పట్టుకోండి" అంటూ ప్రచారం చేస్తోంది.

### పెరిగిన బ్రహ్మచారులు

ప్రభుత్వమే స్వయంగా డేటింగ్ యాప్‌ను ప్రారంభించి.. ప్రచారం చేయటం ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. టోక్యో ఫుటారి స్టోరీ పేరుతో డేటింగ్ యాప్‌ను జపాన్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే ఈ యాప్ కేవలం పెళ్లికి సిద్ధమైన వారికి మాత్రమేనని వెల్లడించింది. జపాన్‌లో 50 ఏళ్ల వయసున్న పురుషుల్లో సుమారు 30 శాతం మంది పెళ్లి కాకుండా బ్రహ్మచారులుగా ఉన్నట్లు అక్కడి ప్రభుత్వం గుర్తించింది. తగ్గుతున్న జననాల రేటును పెంచటం కోసమే ప్రభుత్వం ఈ యాప్‌ను లాంచ్ చేసిందని అధికారులు వెల్లడించారు.

## పడిపోతున్న యువ జనాభా

**ప్రస్తుతం జపాన్‌లో ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే వచ్చే 6 ఏళ్లలో అక్కడ యువ జనాభా భారీగా పడిపోతుందని నివేదికలు చెబుతున్నాయి. దేశంలో యువ జనాభాను కాపాడుకోవటానికి ఇదే చివరి అవకాశంగా భావిస్తున్నట్లు జపాన్ ప్రభుత్వం పేర్కొంది. ఈ యాప్‌ను ప్రమోట్ చేసే కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే 300 యెన్‌లు భారత కరెన్సీలో ఏకంగా రూ.16 కోట్ల నిధులను కేటాయించింది.**

# ల్యాప్ టాప్ ఒడిలో పెట్టుకుంటున్నారా...!

## మగవారి పునరుత్పత్తిపై చెడు ప్రభావం ▪ వేడికి పురుషుల స్పెర్మ్ కౌంట్ తగ్గుతుంది

**ముందడుగు ప్రత్యేకం**
ప్రస్తుత సమాజంలో చాలా మందికి ల్యాప్ టాప్ మన దైనందిన జీవితంలో ఒక ప్రధాన భాగంగా మారిపోయింది. దీనిని అవసరానికే ఉపయోగించినా.. దీని వాడకం సరిగ్గా లేకపోతే మాత్రం మీరు లేనిపోని వ్యాధుల బారిన పడాల్సి వస్తుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ల్యాప్ టాప్ ను గంటల తరబడి మగవారు ఒడిలో పెట్టుకోవడం వల్ల వారి పునరుత్పత్తి ఆరోగ్యంపై చెడు ప్రభావం పడుతుంది.



### వృషణాల్లో ఉష్ణోగ్రత

నిరంతరం వేడికి గురికావడం వల్ల వృషణాల్లో ఉష్ణోగ్రత పెరుగుతుంది. అలాగే పురుషుల స్పెర్మ్ కౌంట్ తగ్గుతుంది. అలాగే స్మెర్మ్ నాణ్యత కూడా చాలా వరకు తగ్గుతుంది. ఎందుకంటే పురుష పునరుత్పత్తి వ్యవస్థ ఉష్ణోగ్రత వైవిధ్యాలకు చాలా సున్నితంగా ఉంటుంది. స్పెర్మ్ ఉత్పత్తి, పనితీరుకు వాతావరణం చల్లగా ఉండటం అవసరమని నిపుణులు చెబుతున్నారు.

### విద్యుదయస్కాంతత్వం విడుదల

ల్యాప్ టాప్ ను ఒడిలో పెట్టుకున్నప్పుడు దాని నుంచి వచ్చే వేడి వృషణాల్లో ఉష్ణోగ్రతను పెంచుతుంది. ఇది 'స్క్రోటల్ హైపర్థెర్మియా' అని పిలువబడే సమస్యకు దారితీస్తుంది. ఇది ఫలదీకరణానికి ఆటంకం కలిగిస్తుంది. అలాగే స్పెర్మ్ ఉత్పత్తి కూడా బాగా తగ్గుతుంది. అంతేకాకుండా ల్యాప్ టాప్ లు తరచుగా విద్యుదయస్కాంతత్వాన్ని విడుదల చేస్తాయి. ఇది స్పెర్మ్ ఆరోగ్యాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు.

### సంతానోత్పత్తి సమస్యలు

**ల్యాప్ టాప్ రేడియేషన్ కు ఎక్కువగా గురికావడం వల్ల ఆక్సీకరణ ఒత్తిడి పెరుగుతుంది. ఇది స్పెర్మ్ కణాలను నాశనం చేస్తుంది. అలాగే వాటి చలనశీలత తగ్గుతుంది. పనితీరు కూడా ప్రభావితం అవుతుంది. ల్యాప్ టాప్ నుంచి వచ్చే వేడి, రేడియేషన్ స్పెర్మ్ నాణ్యత, పరిమాణాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే దానిపై మరిన్ని పరిశోధనలు అవసరం. కానీ ల్యాప్ టాప్ ను మీ ఒడిలో పెట్టుకోవడం వల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి మీరు ప్రయత్నం చేయాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సంతానోత్పత్తి సమస్యలు రాకూడదంటే పురుషులు ల్యాప్ టాప్ ను ఒడిలో అస్సలు పెట్టుకోకూడదు.**

# గుడివాడలో ఉద్రిక్తత ..

## కొడాలి నాని ఇంటిపై కోడిగుడ్లతో దాడి

**అమరావతి :**
గుడివాడ తాజా మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఇంటిపై తెలుగు యువత శ్రేణులు దాడులకు పాల్పడ్డారు. శుక్రవారం కొంత మంది యువకులు కొడాలి నాని ఇంటి వద్దకు వెళ్లి రాళ్లు, కోడిగుడ్ల (Eggs) తో దాడి చేశారు. ఇంటిలోకి వెళ్లేందుకు యత్నించిన యువకులను పోలీసులు అడ్డుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ఇచ్చిన మాటను నిలుపుకోవాలని డిమాండ్ చేస్తూ దాడులకు పాల్పడ్డారు. వైసీపీ ఐదేండ్ల పాలనలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన సమయంలో కొడాలి నాని టీడీపీ, జనసేన నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు. అనేకసార్లు తిట్ల



దండకంతో వార్తల్లో నిలిచారు. చంద్రబాబును, లోకేష్, పవన్‌కల్యాణ్‌పై వ్యక్తిగత దూషణలు చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో సైతం ప్రచారంలో తాను ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని ప్రత్యర్థులకు సవాల్ చేశారు. 2014,2019లో వైసీపీ తరుపున పోటీ చేసి గెలిచిన నాని మొన్నటి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి రాము చేతిలో ఓడిపోయారు.

# చంద్రబాబు కక్ష సాధింపులతో ప్రజాస్వామ్యానికే పెను ముప్పు వచ్చింది

**: వైఎస్ జగన్**

**అమరావతి :**
టీడీపీ నేతల దాడులపై వైసీపీ అధినేత జగన్ స్పందించారు. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థలు కుప్పకూలిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు రాజకీయ కక్షసాధింపులతో ప్రజాస్వామ్యానికే పెనుముప్పు వచ్చిందన్నారు. వైసీపీ నేతలపై జరుగుతున్న దాడులపై ట్విట్టర్ (ఎక్స్) వైఎస్ జగన్ స్పందించారు. టీడీపీ యథేచ్ఛ దాడులతో రాష్ట్రంలో ఆటవిక పరిస్థితులు తలెత్తాయని జగన్ అన్నారు. యంత్రాంగం మొత్తం నిర్వీర్యం అయిపోయిందన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపైనా ఉన్మాదంతో దాడులు చేస్తున్నారని.. వైసీపీ నుంచి పోటీచేసిన అభ్యర్థులకు రక్షణే లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



ఉన్నత చదవులకు కేంద్రాలైన యూనివర్శిటీల్లో ఆచార్యులపై దౌర్జన్యాలకు దిగి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఈ దాడుల ఘటనలపై జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను విజ్ఞప్తి చేశారు. హింసాయుత ఘటనల్లో బాధితులైన పార్టీ కార్యకర్తలకు, అన్నదమ్ములకు, అక్కచెల్లెమ్మలకు వైసీపీ తోడుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

ముందడుగు
శనివారం, 08-6-2024, హైదరాబాద్

# షారుఖ్‌ను బీట్ చేయబోతున్న యష్ .. రామాయణ్ కోసం రికార్డు స్థాయిలో పారితోషికం?




యానిమల్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత బాలీవుడ్ హీరో రణబీర్ కపూర్ నటిస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ రామాయణం. భారతీయ ఇతిహాసం ఆధారంగా రానున్న ఈ సినిమాకు దంగల్ ఫేమ్ నితేష్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. రణబీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా, శాండల్‌వుడ్ స్టార్ యష్ రావణుడిగా నటించనున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ సంబంధించి ప్రీ ప్రోడక్షన్ పనులు జరుపుకుంటున్నట్లు సమాచారం. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్ సంబంధించి ఒక సాలిడ్ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

ఈ సినిమా కోసం స్టార్ హీరో యష్ రికార్డు స్థాయిలో రెమ్యునరేషన్ అందుకోబోతున్నట్లు తెలుస్తుంది. తాజా సమాచారం ప్రకారం. ఈ సినిమాకు యశ్ ఏకంగా రూ. 200 కోట్ల పారితోషికం తీసుకుంటున్నాడని తెలుస్తుంది. దీనికి చిత్రబృందం కూడా ఒకే చెప్పినట్లు టాక్. అయితే ఈ సినిమాకు తీసుకోబోతున్న రెమ్యునరేషన్‌తో యశ్ బాలీవుడ్‌లోనే అత్యధిక పారితోషికం అందుకున్న హీరోగా రికార్డులకెక్కబోతున్నాడు. అంతకుముందు పఠాన్ సినిమాకు షారుక్ రూ.120 కోట్ల రెమ్యునరేషన్ అందుకున్నాడు.

## మూడు రోజుల్లో కల్కి ట్రైలర్..

### కల్కి నుంచి అమితాబ్ కొత్త లుక్ వైరల్!




టాలీవుడ్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌లలో 'కల్కి 2898 AD' ఒకటి. పాన్‌ఇండియా స్టార్ ప్రభాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్విన్ దత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నాడు. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తుండగా.. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూన్ 27న ప్రేక్షకుల ముందుకు సినిమా రానుంది. ఇక విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రభాస్ అభిమానులు ట్రైలర్ కోసం ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఈ మూవీ ట్రైలర్‌ను జూన్ 10న విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు. దీనితో పాటు గ్రాండ్‌గా ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్లాన్ చేయనున్నట్లు సమాచారం. అయితే ట్రైలర్ మరో మూడు రోజుల్లో విడుదల కానుందని తాజాగా మరో అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలో బాలీవుడ్ మెగాస్టార్ అమితా బచ్చన్ కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. అశ్వద్ధామాగా ఆయన కనిపించబోతున్నారు. ఇప్పటికే అభితాబ్ లుక్‌ని పరిచయం చేస్తూ గ్లింప్స్ రిలీజ్ చేశారు. తాజాగా ట్రైలర్‌ను ఇంకా మూడు రోజులే ఉంటూ అమితాబ్ బచ్చన్ కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో అశ్వత్థామ పాత్రలో అమితాబ్ బచ్చన్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాడు. ఈ పోస్టర్‌లో అమితాబ్ బచ్చన్ ఒక చేతిలో ఆయుధం, మరో చేతి పెద్ద కర్ర పట్టుకుని కనిపించారు.



## మంచు విష్ణు కన్నప్ప టీజర్ రిలీజ్ డేట్ ఫిక్స్

మంచు విష్ణు హీరోగా వస్తున్న తాజా చిత్రం 'కన్నప్ప. మోహన్ బాబు నిర్మాణంలో వస్తున్న ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. అత్యంత భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రం రూపొందుతోంది. ఇప్పటికే మూవీ నుంచి ఫస్ట్ లుక్‌ను విడుదల చేసిన చిత్రబృందం తాజాగా టీజర్ అప్‌డేట్‌ను ఇచ్చింది. ఈ సినిమా టీజర్‌ను జూన్ 14న విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. విష్ణు టైటిల్ రోల్ పోషిస్తున్న కన్నప్పలో మోహన్‌బాబు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, నయనతార, మధుబాల, శరత్‌కుమార్, శివరాజ్‌కుమార్ ఇతర నటీనటులు కీ రోల్స్‌లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి మెలోడీ బ్రహ్మ మణిశర్మ, స్టీఫెన్ దేవసి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సమకూరుస్తున్నారు. 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ, అవా ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై భారీ బడ్జెట్‌తో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి పరుచూరి గోపాలకృష్ణ, బుర్రా సాయిమాధవ్, తోట ప్రసాద్ స్క్రీన్‌ప్లే సమకూరుస్తున్నారు.

## సత్యరాజ్, రజినీకాంత్ కూలీ షూటింగ్ షెడ్యూల్ వచ్చేసింది

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా సినిమాల్లో ఒకటి కూలీ. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో తలైవా 171 గా వస్తోంది. కూలీలో పాపులర్ నటుడు సత్యరాజ్ రజినీకాంత్ స్నేహితుడిగా కనిపించబోతున్నాడని తెలిసిందే. తాజాగా కూలీ షూటింగ్‌కు సంబంధించిన అప్‌డేట్ మూవీ లవర్స్‌ను ఖుషీ చేస్తోంది. ఈ మూవీ ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ చెన్నై, హైదరాబాద్‌లో ప్లాన్ చేసింది లోకేశ్ కనగరాజ్ టీం.

ఈ షెడ్యూల్‌లో రజినీకాంత్, శృతిహాసన్, సత్యరాజ్‌పై వచ్చే సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. తాజా టాక్ ప్రకారం ఇదే నెలలో కూలీ షూటింగ్ షురూ కానుంది. ఈ వార్తను ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు సత్యరాజ్, తలైవా అభిమానులు. రజినీకాంత్ ఇటీవలే అబుదాబి ట్రిప్‌ను ముగించుకొని చెన్నైకి చేరుకున్నాడని తెలిసిందే. ముందుగా వచ్చిన అప్‌డేట్ ప్రకారం ఇక




షూట్‌తో బిజీగా కాబోతున్నాడన్నమాట. ఇప్పటికే లాంఛ్ చేసిన కూలీ టైటిల్ టీజర్‌లో సూపర్ స్టార్ బంగారంతో డిజైన్ చేసిన ఆయుధాలు, వాచ్ ఛైన్లతో చేస్తున్న స్టైలిష్ ఫైట్ సన్నివేశాలు స్టన్నింగ్‌గా సాగుతూ సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తున్నాయి. గోల్డ్ అక్రమ రవాణా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో రజినీకాంత్ స్మగ్లర్‌గా కనిపించబోతున్నాడని టీజర్ ద్వారా అర్థమవుతోంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్నారు. రజినీకాంత్‌లోని విలనిజం అంటే తనకు చాలా ఇష్టమని లోకేశ్ కనగరాజ్ ముందుగా చెప్పినట్టుగానే కూలీలో తలైవా విలనిజాన్ని ఎలివేట్ చేయబోతున్నానని టీజర్‌తో తెలిసిపోతుంది.